# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వినాయక చవితి పండుగను రాష్ట్ర ప్రజలు ఈరోజు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు.
- ❖ కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.
- ❖ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విశాఖపట్టణంలో పర్యటించనున్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.
- ❖ వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

========================

వినాయక చవితి పండుగను రాష్ట్ర ప్రజలు ఈరోజు ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. తెల్లవారుజాము నుండే గణనాధుని ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. వాడ వాడలా వెలిసిన వినాయక మండపాలతో రాష్ట్రమంతా అధ్యాత్మికశోభ సంతరించుకుంది. ఇక కొద్ది సేపటి క్రితం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలోని సితార సెంటర్ వద్ద దూండి గణేశ్ సేవా సమితి ఏర్పాటు చేసిన మహా గణపతిని దర్శించుకున్నారు. అంతకుముందు తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తమ తమ లక్ష్యాలకు ఏ అడ్డంకులు రాకుండా ఆ గణపతి రక్షించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఊరు వాడా మండపాలు నెలకొల్పి భక్తితో, ఆనందంతో, ప్రోత్సాహంతో గణేశుడిని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని ఆ వినాయకుని ప్రార్థిస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

========================

చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈరోజు నుండి సెప్టెంబర్ 16 వరకూ జరగనున్నాయి. వినాయక చవితి పర్వదినమున రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను దేవదాయ శాఖ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి సమర్పించారు. అనంతరం కాణిపాకం దేవస్థానంలో నూతన అన్నదాన ప్రసాద భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం రామ్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని ప్రధాన దేవాలయాల పాలకవర్గాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆధ్యాత్మికతను అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అదే విధంగా రాష్ట్రంలో 5 వేల 250 ఆలయాలకు ధూప దీప నైవేధ్యం అమలు చేయడం జరుగుతోందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విశాఖపట్టణంలో పర్యటించనున్నారు. స్థానిక నోవటెల్ హోటల్లో జరిగే "ఆహార తయారీ సదస్సు" లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం రాడిసన్ బ్లూ రిసార్ట్ చేరుకొని గ్రిఫిన్ ఫౌండర్ నెట్ వర్క్స్ మీటింగ్ కు హాజరవుతారు. సమావేశం అనంతరం చిత్తూరు జిల్లా పర్యటనకు హెలీకాప్టర్ లో బయలదేరుతారు.

=========================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని ఎన్డీయే కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సి.పి. రాధాక్రిష్ణన్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఇఓ శ్యామలారావు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు రాధాక్రిష్ణన్ ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాక మొదటిసారి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. అంతకుముందు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=========================

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చే శనివారం కృష్ణా జిల్లాలోని గుడివాడలో "జాబ్ మేళా" నిర్వహించబోతున్నామని కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో 14 కి పైగా ప్రముఖ కంపెనీలు మౌఖిక పరీక్షలను నిర్వహిస్తాయని చెప్పారు. ఈ కంపెనీలలో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, బి.ఫార్మసి పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపిక అయిన వారికి వేతనం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలియజేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకువాలని కలెక్టర్ కోరారు.

=========================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ మూడు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు విశాఖపట్టణానికి రానున్నారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో జనసేన పార్టీకి చెందిన విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన పాల్గొనున్నారు. రేపు, ఎల్లుండి

పార్టీ లెజిస్లేచర్ మీటింగ్ తో పాటూ... వివిధ రంగాల ప్రముఖులతో పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు. ఇక ఈనెల 30న "సేనతో సేనాని" అనే బహిరంగ సభలో పవన్ కల్యాణ్ పాల్గొని ప్రసంగించనున్నారు.

========================

వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ.. తీవ్ర అల్పపీడనంగా బలపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే 24 గంటల్లో ఇది ఒడిశా మీదుగా నెమ్మదిగా కదులుతుందని పేర్కొంది. ఈ అల్పపీడనం వల్ల రాష్ట్రంలోని పలు చోట్ల రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖాధికారి బి.శేఖర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

అల్పపీడనం నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ అధికారులు సూచించారు. తీరం వెంట 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. అదే విధంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

========================

అల్పపీడన ప్రభావంతో ఈ రోజు సాయంత్రం 5 గంటల సమయానికి పార్వతీపురం మన్యం  జిల్లాలోని సీతంపేటలో అత్యధికంగా 77 మిల్లీ మీటర్లు, కోనసీమ జిల్లా మలికిపురంలో 74.5 మిల్లీ మీటర్లు, భీమవరంలో 67.5 మిల్లీ మీటర్లు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 62.5 మిల్లీ మీటర్లు చొప్పున అధిక వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ తెలిపారు. మన రాష్ట్రంతో పాటూ ఎగువున కురుస్తున్న భారీ వర్షాలతో వివిధ ప్రాజెక్టుల్లోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదృతంగా ప్రవహిస్తున్న నదులు, కాలువలు, వాగులు దాటే ప్రయత్నం, స్నానాలు చేయడం లాంటివి చేయ రాదన్నారు. వినాయక నిమజ్జనాల్లో నదులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులను పాటిస్తూ.. అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

========================

విజయవాడ, గుంటూరు నగరాల్లో ఈరోజు తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయం ఒక యూనిట్‌గా నిరంతరాయంగా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు, వరద స్పందన బృందాలు పని చేయాలని సూచించారు. వరదలకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరీవాహక గ్రామాల ప్రజలకు తెలియజేయాలని సూచించారు. 91549 70454 నంబర్‌తో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక ప్రకాశం బ్యారేజ్‌లోకి ఒక లక్షా 37 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో 69 గేట్లు ఎత్తి సముద్రంలోకి లక్షన్నర క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

========================
========================